RNI NO:APTEL /2023/90201

POST REGD NO :NSV/15/2026-28

రాజధాని

తెలుగు దినపత్రిక

వాయిస్

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 03 | సంచిక : 08 | 28 శనివారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు



తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కుమద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. పెరంబూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతూ విజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత విజయ్ తిరుచ్చి, పెరంబూర్ స్థానాల నుంచి పోటీ చేశారు. అయితే, ఆయన గెలుపును సవాలు చేస్తూ పెరంబూర్ నియోజకవర్గానికి చెందిన దినేశ్ అనే ఓటరు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. స్థిరాస్తులకు సంబంధించి విజయ్ తన నామినేషన్‌లో పూర్తి వివరాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి, ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారాన్ని వెల్లడించారని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎన్నికల పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతూ విజయ్ చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీ నారాయణన్.. చివరకు కొట్టివేశారు.

టీఎంసీ రెబల్స్‌కు షాకిచ్చిన హైకోర్టు.. మమతా బెనర్జీకి భారీ విజయం

ఢిల్లీ, నవంబర్ 27: టీఎంసీ ఎమ్మెల్యేల తిరుగుబాటుతో ఇబ్బందుల్లో పడిన పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి భారీ ఊరట లభించింది. బెంగాల్ శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ నియామకాన్ని కలకత్తా హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. ఇక, పార్టీ చీఫ్ విప్‌గా ఎమ్మెల్యే అక్రుజమాన్ నియామకాన్ని కూడా ఉన్నత న్యాయస్థానం పక్కనబెట్టింది. ప్రతిపక్ష నేత నియామకంపై స్పీకర్ నిర్ణయం అస్థిరంగా ఉందని కోర్టు ఈ నందర్భంగా వెల్లడించింది. ఈ విషయంలో మమతా బెనర్జీ వర్గం వాదనలు తిరిగి పరిశీలించా లని స్పీకర్ రతీంద్ర బోస్‌ను ఆదేశించింది. అనంతరం 10 రోజుల్లోగా కొత్త ప్రతిపక్ష నేత నియామకంపై ఉత్తర్వులు జారీ చేయాలని స్పష్టం చేసింది. దీంతో దీదీ వర్గానికి విజయం దక్కినట్లయ్యింది.

డీలిమిటేషన్‌పై కేంద్రం కీలక సవరణలు

- అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య 50 శాతం పెంపు
- 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తి కొనసాగింపు
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు కొత్త ప్రతిపాదనలు
- నవంబర్ 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ : నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, డీలిమిటేషన్ తర్వాత ఏ రాష్ట్రానికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతమున్న పార్లమెంటరీ ప్రాతినిధ్య నిష్పత్తి తగ్గకుండా రాజ్యాంగ సవరణ బిల్లులో మార్పులు ప్రతిపాదించింది. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను ప్రస్తుత సంఖ్యతో పోలిస్తే 50 శాతం పెంచి, రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 2051 వరకు కొనసాగించే ప్రతిపాదనకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం సేవాతీర్థ్‌లో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు జరిగింది. కొత్త ప్రతిపాదన ప్రకారం ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచనున్నారు. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు యథాతథంగా కొనసాగించేలా నిబంధనలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ ఎన్నికైన సభ్యుల సంఖ్య ఈ పెంపుతో సుమారు 816కు చేరే అవకాశం ఉంది. రాజ్యాంగంలో గరిష్ఠ పరిమితిని 850 స్థానాలుగా ప్రతిపాదిస్తున్నారు. ఈ మార్పులతో జనాభా పెరుగుదల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగినా దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య వాటా తగ్గకుండా చూడాలన్నది కేంద్రం ఉద్దేశంగా తెలుస్తోంది. ఈ బిల్లుకు పార్లమెంటులో మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మద్దతు పొందలేకపోవడంతో ఆమోదం పొందలేదు. ఈ నేపథ్యంలో తాజా ప్రతిపాదనల్లో అన్ని రాష్ట్రాల సీట్లను ఒకే నిష్పత్తిలో పెంచే అంశాన్ని చేర్చినట్లు వార్తలు వెలువడ్డాయి. డీఎంకేకు చెందిన 22 మంది, ఎన్సీపీ (శరద్ పవార్ వర్గం)కు చెందిన ఎనిమిది మంది ఎంపీల మద్దతు ఈ బిల్లు ఆమోద ప్రక్రియలో ప్రాధాన్యం సంతరించుకోనుంది. అయితే బిల్లు ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలం సభలో హాజరై ఓటు వేసే సభ్యుల సంఖ్యతో పాటు రాజ్యాంగంలోని ప్రత్యేక మెజారిటీ నిబంధనలపై ఆధారపడి ఉంటుంది. - 2లో..

రాష్ట్ర అభివృద్ధికి 30 కీలక నిర్ణయాలు

- ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లుకు కేబినెట్ ఆమోదం
- కియా, అదానీ, సెయింట్ గోబైన్ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు
- అమరావతి నిర్మాణాలకు అదనపు నిధుల కేటాయింపు
- పరిశ్రమలు, విద్యుత్, భూ సమస్యలపై కీలక నిర్ణయాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి, రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రా మిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, రాజధాని నిర్మాణాలకు ఊతమిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సుమారు మూడు గంటలపాటు వర్చువల్ విధానంలో కొనసాగిన ఈ సమావేశంలో మొత్తం 30 అంశాలతో కూడిన అజెండాకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యత రహా పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసే ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే జాప్యాన్ని తగ్గించి, పారిశ్రామికవేత్తలకు వేగంగా అనుమతులు కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం భావిస్తోంది. పెట్టుబడులకు ప్రోత్సా హకాలు, అమరావతి నిర్మాణాలు, పారిశ్రామిక పార్కులు, భూ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై మంత్రివర్గం విస్తృతంగా చర్చించింది.రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసేలా కియా, అదానీ, సెయింట్ గోబైన్ - 2లో..

వైఎస్ జగన్‌ను కలిసిన కొటారు అబ్బయ్య చౌదరి

- తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో భేటీ
- తండ్రి కొటారు రామచంద్రరావుతో కలిసి సమావేశం
- దెందులూరు నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై చర్చ
- స్థానిక సమస్యలు, పార్టీ వ్యవహారాలపై సమాలోచన



తాడేపల్లి, నవంబర్ 27 : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొటారు అబ్బయ్య చౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో తన తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు కొటారు రామచంద్రరావుతో కలిసి ఆయన వైఎస్ జగన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దెందులూరు నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానంగా చర్చించినట్లు అబ్బయ్య చౌదరి వెల్లడించారు. నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న రాజకీయ మార్పులు, పార్టీ పరిస్థితులు, స్థానికంగా ఎదురవుతున్న అంశాలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులు - 2లో..

మహిళా సాధికారతకు రాజకీయ ప్రాతినిధ్యం కీలకం

- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరగదు
- రెండు బిల్లులకూ అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలి
- బిల్లులను వ్యతిరేకించిన వారిని మహిళలు తిరస్కరిస్తారు
- -మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులకు
- సీఎం చంద్రబాబు మద్దతు
- కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామితో ఢిల్లీలో
- ముఖ్యమంత్రి మీడియా సమావేశం



ఢిల్లీ, రాజధాని వాయిస్ : మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంటు స్థానాలను పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. ఈ కీలక నిర్ణయాలకు మద్దతు తెలిపేందుకే ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఇతర కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కీలక దశకు చేరుకుందని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటు న్నారని చెప్పారు. ఇప్పుడు రాజకీయ రంగంలోనూ వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. మహిళా సాధికారతకు సామాజిక, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి వివరించారు.

జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగాలి

1971 జనాభా లెక్కల ఆధారంగా 1976లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిందని, ఆ తర్వాత కూడా పాత జనాభా ప్రాతిపదికనే లోక్‌సభ స్థానాల సంఖ్య కొనసాగుతోందని చంద్రబాబు వివరించారు. అప్పట్లో దేశ జనాభా 58.8 కోట్లుగా ఉండగా, లోక్‌సభలో 543 స్థానాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశ జనాభా సుమారు 147 కోట్లకు చేరుతున్న నేపథ్యంలో అదే 543 స్థానాలతో కొనసాగడం సమంజసం కాదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా పెరగాలని అభిప్రాయపడ్డారు. 1971లో ప్రతి పది లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సుమారు 27 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచితే ప్రతి 18 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను పార్లమెంటులో సమర్థంగా ప్రస్తావించేందుకు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని విస్తరించేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

దక్షిణాది ప్రయోజనాలకు భంగం కలగదు

జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు గతంలో దేశానికి ఆదర్శంగా నిలిచాయని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న - 2లో..

మిగిలిన రెండు దశల్లోనూ ఇదే జోరు కొనసాగించాలి: నారా లోకేశ్



అమరావతి, రాజధాని వాయిస్ : తొలి దశ పంచా యతీ ఎన్నికల విజయంతో సంతృప్తి చెందొద్దని.. మిగిలిన రెండు దశల్లోనూ ఇదే జోరు కొనసాగించాలని తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ అన్నారు. గెలు పుపై ధీమాతో నిర్లక్ష్యం వద్దని, ప్రతి ఎన్నికనూ ప్రతిష్టా త్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడా రు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినంద నలు తెలిపారు. 2024 ఎన్నికల్లో మొదలైన కూటమి విజయ పరంపర పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగుతోందన్నారు.రాబోయే రెండు, మూడు విడతల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించాలని లోకేశ్ ఆకాంక్షించారు. పోలింగ్ శాతం పెరిగే కొద్దీ మెజార్టీలు కూడా పెరుగుతాయని, ప్రతి ఓటునూ కీలకంగా భావించి పనిచేయాలని సూచించారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కష్టపడిన దానికంటే ఎక్కువగా పంచాయతీ ఎన్నికల్లో శ్రమించాలని పిలుపునిచ్చారు. జనసేన, భాజపా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎన్నికలు లేని నియోజ కవర్గాల నేతలు సైతం అవసరమైన చోట ప్రచార బాధ్యతలు చేపట్టాలని సూచించారు. సమస్య లుంటే పార్టీ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బలహీనంగా ఉన్న చోట గెలుపే లక్ష్యంగా.. బలంగా ఉన్న చోట మెజార్టీ పెంచుకునేలా పనిచేయాలన్నారు. వరుస ఓటములతో వైకాపా ఫ్రస్ట్రేషన్‌లో ఉం దని.. ఆ పార్టీ నేతలు హింసకు పాల్పడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. దాడులు, కుట్రల పట్ల ఆప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

విజయవాడ ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటాం: మేయర్ వంగవీటి రాధాకృష్ణ

విజయవాడ, నవంబర్ 27 : నగర ప్రజలు ఇచ్చిన తీర్పు, ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటామని విజయవాడ మేయర్ వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) నాయకత్వంలో నగరంలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల సహకారంతో పనిచేస్తానని చెప్పారు. అందరం ఐక్యంగా ముందుకు సాగుతామన్నారు. విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. నగర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానన్నారు. పారిశు ద్ధ్యం, వైద్య ఆరోగ్యానికి సంబంధించిన దస్త్రంపై తొలి సంతకం చేశానని.. 30 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టబోతున్నామని చెప్పారు.విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణను చూడాలనేది నగర ప్రజల బలమైన కోరికగా ఉండేదని.. ఇప్పుడు అది నెరవేరిందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. “అమరావతికి ముఖద్వారం విజయవాడ. ఇది అత్యంత పురాతన నగరం. మేయర్ రాధాకృష్ణకు విజయవాడ కూటమి శ్రేణుల సహకారం ఉంటుంది. కొత్త కౌన్సిల్ ముందు ఎన్నో సవాళ్లున్నాయి. ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌తో సమర్థ నాయకత్వం వచ్చింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిధులు తీసుకొస్తాం. అత్యధికంగా కేంద్ర నిధులు వచ్చేలా కృషి చేస్తాం. పీపీపీ మోడల్‌లో అభివృద్ధి పనులు చేపడతాం.